నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# హైదరాబాద్

శుక్రవారం 24 నవంబర్ 2023
FRIDAY, NOVEMBER 24, 2023 | HYDERABAD | పేజీలు PAGES : 16

మహేశ్వరంలో ముంపు బాధలు తొలగిపోయాయి
వెయ్యి కోట్లతో నాలా అభివృద్ధి పథకం
రూ. 670 కోట్లతో శివారుకు తాగునీళ్లు తెచ్చుకున్నాం
తుక్కుగూడలో కొత్తగా 52 పరిశ్రమలు ఏర్పాటు
మహేశ్వరానికి మెడికల్ కాలేజీ, 500 పడకల దవాఖాన
మెడికల్ హబ్‌గా కందుకూరు... అక్కడి వరకు మెట్రో
పహాడి షరీఫ్‌లో మైనార్టీల కోసం ఐటీ పార్కు
పాలమూరు ఎత్తిపోతలతో కృష్ణానీళ్లు
సబితమ్మకు భూదేవంత ఓపిక.. మళ్లీ గెలిపించండి
ప్రజా ఆశీర్వాదసభలో ముఖ్యమంత్రి కేసీఆర్

లోపలి పేజీల్లో..




మహేశ్వరం ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్





మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన జనం, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బూడిదలో పోసిన పన్నీరే

## పదేండ్ల అభివృద్ధిని ఆగం చేస్తరు



### కాంగ్రెస్ చేసిన తప్పుతోనే 58 ఏండ్లు గోస పడ్డం

### మళ్లీ పొరపాటు చేయొద్దు.. ఆగమాగం కావొద్దు

**'కాంగ్రెస్ పార్టీ చిన్న తప్పు చేస్తే 58 ఏండ్లు గోసపడ్డాం.** మళ్లీ పొరపాటు జరిగితే.. దారితప్పి కాంగ్రెస్‌కు ఓటేస్తే... పదేండ్ల నుంచి చేసిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది' అని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి మద్దతుగా గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ సృష్టించిన కబ్జాకోరు రాజ్యంలో వర్షాలకు నిండిన చెరువుల నుంచి నీటిని వదిలితే కింద కొట్టుకుపోయేవని, నీళ్లు వదలకపోతే కాలనీలు మునిగే పరిస్థితి ఉండేదన్నారు. మూడేండ్ల కిందట పడ్డ భారీ వర్షాలకు మంత్రి సబితారెడ్డి వరదకు వెరవకుండా పర్యటించి సమస్యను పరిష్కరించాలని కోరడంతో వెయ్యి కోట్లను మంజూరు చేసి నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం చేపట్టినట్లు తెలిపారు. అలాగే శివారు దాహార్తి తీర్చేందుకు రూ.670కోట్లను మంజూరు చేశామన్నారు. మహేశ్వరంలో ముంపు, తాగునీటి బాధలను తీర్చిన సబితమ్మను మరిచిపోవద్దని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో మహేశ్వరానికి మెడికల్ కాలేజీ, 500 పడకల దవాఖాన వచ్చిందని, తుక్కుగూడలో కొత్తగా 52 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ఫాక్స్‌కాన్‌లాంటి కంపెనీల రాకతో లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ముస్లిం మైనారిటీ పిల్లల కోసం పహాడి షరీఫ్‌లో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. కందుకూరు మెడికల్ హబ్‌గా మారబోతున్నదని, అలాగే కందుకూరు వరకు మెట్రో రైలు తీసుకొస్తామని చెప్పారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయిందని, త్వరలోనే మహేశ్వరం నియోజకవర్గానికి కృష్ణానీళ్లు వస్తాయన్నారు. భూదేవంత ఓపికతో సామాన్య కార్యకర్తలా కష్టపడి పని చేస్తున్న మంత్రి సబితారెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. వర్షంలోనూ భారీ సంఖ్యలో వచ్చిన జనసందోహాన్ని చూసిన సీఎం కేసీఆర్ మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి గెలుపు ఖాయమైపోయిందని చెప్పడంతో సభలో చప్పట్లు మారుమోగాయి.

- రంగారెడ్డి, నవంబరు 23 (నమస్తే తెలంగాణ)